క్లుప్తంగా

బీఈడీ కళాశాల ప్రభాకరరావు ఇకలేరు



నాదెండ్ల: గణపవరం తోటకూర రామకోటయ్య బీఈడీ కళాశాల వ్యవస్థాపకుడు తోటకూర ప్రభాకరరావు (74) అనారోగ్యంతో గురువారం కన్నుమూశారు. ఆయన ప్రభుత్వ ఎస్ఎస్‌సీవీఎస్ జూనియర్ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేసి 2009లో రిటైరయ్యారు. 2006లో తన సోదరుడైన సీఆర్ కళాశాల మాజీ ప్రిన్సిపల్ తోటకూర నారాయణతో కలిసి బీఈడీ కళాశాలను ఏర్పాటు చేశారు. బీఈడీ కళాశాలలో చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు ప్రస్తుతం ఉపాధ్యాయ వృత్తిలో పనిచేస్తున్నారు. కొన్నిరోజులుగా కాలేయం, కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని కిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించి మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని చిలకలూరిపేటలోని సీఆర్ కాలనీలో ఆయన స్వగృహానికి తరలించారు. పలువురు అధ్యాపకులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు, వ్యాపారవేత్తలు నివాళులర్పించారు. ఆయన కుమారుడు, కుమార్తె అమెరికాలో స్థిరపడ్డారు.

సంఘ సంస్కర్త ఫాతిమా షేక్ జయంతి వేడుకలు



రొంపిచర్ల: స్థానిక చెరువుకట్ట సెంటర్లో గురువారం బీసీ సంక్షేమ సంఘం, ముస్లిం మైనార్టీ సంఘం ఆధ్వర్యంలో సంఘ సంస్కర్త ఫాతిమా షేక్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్ర పటానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సరికొండ తిమ్మరాజు మాట్లాడుతూ ఫాతిమా సావిత్రి భాయి పూలే స్నేహితురాలు, సహోద్యోగి అన్నారు. జ్యోతిరావ్ పూలే దగ్గర తన భార్య సావిత్రి భాయి పూలే తో పాటు ఫాతిమా విద్యనభ్యసించారన్నారు. స్త్రీ విద్య వ్యాప్తికి ఎంతో కృషి చేశారని అన్నారు. పూలే దంపతులు గృహ బహిష్కరణకు గురైనప్పుడు ఫాతిమా వారికి తన ఇంట్లో ఆశ్రయం కల్పించి పాఠశాల స్థాపించి విద్యా వ్యాప్తికి ఎంతో కృషి చేసిన మహనీయురాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం మండల నాయకులు ఉప్పలపాటి భాస్కరరావు, పి. హుస్సేన్, మైనారిటీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

తిరుమల ఘటన బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

చిలకలూరిపేట: తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనం కోసం జరిగిన తొక్కిసలాట దుర్ఘటనపై ప్రభుత్వం సమగ్ర విచారణ నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి తాళ్లూరి బాబురావు డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ క్యూలైన్ల వద్ద టీటీడీ సిబ్బంది, పోలీసుల నిర్లక్ష్యం కారణంగానే పలువురి మృతి, అస్వస్థతకు కారణమని ఆరోపించారు. టికెట్ల జారీపై నిర్దిష్ట ప్రమాణాలు పాటించకపోవడంతో ఇలాంటి పరిస్థితి ఏర్పడుతుందని ముందే అంచనా వేయలేకపోవడం అధికారుల తప్పిదమని విమర్శించారు. పోలీసులు భక్తులను ఇష్టం వచ్చినట్లు లాగి పడవేయడం, లాఠీచార్జి చేయడం తొక్కిసలాటకు దారి తీశాయని ఆరోపించారు. బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ. కోటి చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఫలితాల్లో సత్తాచాటాలి

నాదెండ్ల: రానున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు సత్తా చాటి జిల్లాలోనే టాపర్లుగా నిలవాలని గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం కృష్ణానాయక్ చెప్పారు. పదో తరగతి చదువుతున్న 160 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఎస్టీయూ నాయకుడు దివంగత సింగు మదన్‌మోహన్ కుమార్తె సింగు నాగమల్లేశ్వరి, తూబాటి శ్రీహరిరావు దంపతులు అందించిన ఆర్థికసాయంతో ఎస్టీయూ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టిడ్కో సమస్యలు పరిష్కరించాలి

చిలకలూరిపేట: టిడ్కో గృహ సముదాయంలో వెంటనే సమస్యలు పరిష్కరించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి పేలూరి రామారావు కోరారు. టిడ్కో గృహ సముదాయంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబుకు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. పలువురు సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

చౌక ధరల దుకాణాల్లో తనిఖీలు

బొల్లాపల్లి: మండలంలోని రేమిడిచర్ల గ్రామంలో చౌక ధరల దుకాణాలపై రెవెన్యూ, పౌర సరఫరాల శాఖ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. రేషన్ షాపుల్లో రికార్డులను, స్టాకును పరిశీలించారు. తహసీల్దార్ ఎ.వి. సుధాకర్ మాట్లాడుతూ గ్రామంలోని రేషన్ షాపులపై తనిఖీలు నిర్వహించామన్నారు. పూర్తిస్థాయి వివరాలు త్వరలో వెల్లడిస్తామని తెలిపారు.

మొక్కజొన్న సాగుకు సమాయత్తం

- రెండవ పంటగా రైతన్నల ఆసక్తి
- ఇప్పటికే 3 వేల ఎకరాల్లో పంట సాగు
- బహిరంగ మార్కెట్‌లో క్వింటా ధర రూ. 2200
- ఎకరానికి 30 నుంచి 40 క్వింటాల వరకూ దిగుబడి



పొలంలో మొక్కజొన్న విత్తనాలు విత్తుతున్న కూలీలు

శావల్యాపురం: రబీ సీజను ప్రారంభం కావడం అన్నదాతలు ఆరుతడి పంట మొక్కజొన్న సాగుకు సమాయత్తమవుతున్నారు. వరి పంట సాగు చేసిన రైతులందరూ రెండవ పంట మొక్కజొన్న పంట సాగుకు ఆసక్తి చూపుతున్నారు. మొక్కజొన్న సాగులో శ్రమ పెట్టుబడులు తక్కువ ఉండటంతో గతంలో ఎన్నడూ లేని విధంగా సాగు పెరిగింది. పంట మార్పిడి విధానం, సకాలంలో తెగుళ్ల నివారణతో పాటు సస్యరక్షణ చర్యలు చేపడితే ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తాయని వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుతం అన్నదాతలు మొక్కజొన్న పంట సాగులో సమాయత్తమవుతున్నారు.

గాతాలు తీసి.. విత్తులు నాటి..

వరి పంట సాగు చేసిన మాగాణి భూముల్లో గాతాలు తీసి మొక్కజొన్న విత్తనం నాటే పనులు నిమగ్నమయ్యారు. ఒక్కో ఎకరానికి 8 నుంచి 10 కేజీలు విత్తనాలు గాతాలు తీసినందుకు విత్తనం నాటినందుకు రూ.4 వేలు కూలీలు తీసుకుంటున్నారు. ఎకరానికి రూ. 30 నుంచి 35 వేలు పెట్టుబడి అవుతుందని నిరంతరం పొలాన్ని పర్యవేక్షణ చేయాల్సిన పనిలేదని మొక్క పూత దశలో ఉన్నప్పుడు తెగుళ్లు వ్యాపిస్తే గులికలు పురుగుమందులు పిచికారీ చేస్తే సత్వరమే తెగుళ్ల నివారణ అవుతాయి. కాగా బహిరంగ మార్కెట్‌లో క్వింటా ధర రూ. 2200 ఉందని దీంతో అన్నదాతలు అధిక సంఖ్యలో మొక్కజొన్న పంట సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే 3 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయగా, ఈ ఏడాది ఇంకా పెరుగుతుందని వ్యవసాయ అధికారులు తెలిపారు. ఎకరానికి 30 నుంచి 40 క్వింటాల దిగుబడులు వస్తాయని రైతులు వెల్లడించారు.

ప్రభుత్వం అండగా ఉండాలి



వరి పంట పూర్తికాగానే రెండవ పంట మొక్కజొన్న పంట ఏడు ఎకరాల్లో సాగు చేశా. ప్రస్తుతానికి బహిరంగ మార్కెట్‌లో క్వింటా ధర రూ.2200 లు పలుకుతోంది. దళారులను నియంత్రణ చేయటంతో పాటు రైతు చేతికి పంట రాగానే ధర పతనం కాకుండా ప్రభుత్వం చూడాలి. అలాగే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర ప్రకటించటం ద్వారా రైతు ఆర్థికంగా నష్టపోకుండా ఉంటారు. రైతుకు ప్రభుత్వం అండగా ఉండాలి.

–చెరుకూరి ప్రసాదు, రైతు, శావల్యాపురం

ఈ-పంట నమోదు చేయించాలి



వరి పంట సాగు పూర్తి అయిన రైతులు ఆరుతడి పంట మొక్కజొన్న పంట సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా పంటలు సాగు చేసే రైతులందరూ ఈ-పంట నమోదు చేయించాలి. తద్వారా పంటలు కొనుగోలు సమయంలో ప్రకృతి వైపరీత్యాల సంభవించినప్పుడు రైతులకు పరిహారం అందించటానికి దోహదపడుతుంది. ఇప్పటి వరకు మొక్కజొన్న పంట సాగు 3 వేలు ఎకరాలో సాగు చేశారు. రైతులందరూ ఈ-పంట నమోదు చేయించి వ్యవసాయ అధికారుల సూచనలు సలహాలు పాటించాలి.

–రామినేని రామారావు, వ్యవసాయాధికారి, శావల్యాపురం

వేర్వేరు ప్రాంతాల్లో సంక్రాంతి సంబరాలు



సంబరాల్లో పాఠశాల చిన్నారులు



క్రికెట్ పోటీ ప్రారంభోత్సవానికి ముందు మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రవినాయక్



పాఠశాలలో ఏర్పాటుచేసిన భోగి మంటలు

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం పెద్దవరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు ఇచ్చారు. పిల్లలు హరిదాసుల వేషాలతో అలరించారు. భోగి మంటలు వేశారు, గాలిపటాలు ఎగురవేశారు. హెచ్ఎం ఘంటా నాగేశ్వరరావు విద్యార్థులకు సంక్రాంతి పండుగ విశేషాలను వివరించారు. హాజరైన అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులు ముగ్గుల్లోని గొబ్బెమ్మల చుట్టూ, భోగి మంటల చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ నృత్యం చేశారు. హాజరైన గ్రామస్తులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

సంక్రాంతి అంటేనే రైతుల పండుగ

శావల్యాపురం: సంక్రాంతి పండుగ అంటే రైతుల పండుగ అని మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు అన్నారు. గురువారం శ్రీరామా పబ్లిక్ స్కూల్లో ముందుస్తుగా సంక్రాంతి పండుగ వేడుకలు కోలాహలంగా విద్యార్థులు రైతుల నడుమ ఘనంగా నిర్వహించారు. చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజరు వలేటి శివకృష్ణ, రైతు నేతలు ముండ్రు హనుమంతరావు, ఎ.గోపాలరావు, పాఠశాల కరస్పాండెంట్ కనగాల వెంకట రామ మోహన్‌చందు, ప్రిన్సిపాల్ గోళ్ళమూడి రత్నకుమారి, డైరెక్టరు అజిత్ చందు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఏపీ మోడల్ స్కూల్లో...

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం గ్రామంలో గల ఏపీ మోడల్ స్కూల్‌లో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని విద్యార్థులకు ఆటల పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. పాఠశాల మైదానంలో పోటీలను ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రవినాయక్ ప్రారంభించారు. స్టూడెంట్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్‌లో భాగంగా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. క్రీడల ప్రారంభోత్సవ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కసిరెడ్డి వెంకట కోటిరెడ్డి, ఎస్ఎంసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సందడిగా సంక్రాంతి వేడుకలు

చిలకలూరిపేట టౌన్: పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో ఉన్న గ్రీన్ వ్యాలీ పాఠశాలలో గురువారం సంక్రాంతి వేడుకలు సంబరంగా కొనసాగాయి. పాఠశాల ఆవరణ అంతా రంగవల్లులు, గూడు బసవన్నలు, కోడి పందేలు, సన్నాయి రాగాలు, హరిదాసుల గీతాలు, గాలిపటాలు, భోగి మంటలు, సంక్రాంతి పొంగళ్ల సంప్రదాయ వంటకాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో విద్యార్థులు ఉపాధ్యాయులు సందడి చేశారు. కార్యక్రమంలో గ్రీన్ వాలి పాఠశాల డైరెక్టర్ పి.ఉదయకుమార్, ప్రిన్సిపల్ హేమ, ఇన్‌చార్జి కాశీ విశ్వనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

రచయిత చిట్టిబాబుపై చర్యలు తీసుకోండి



నరసరావుపేట: రజకులను అవమానపరిచి మాట్లాడిన రచయిత చిట్టిబాబుని వెంటనే అరెస్టు చేయాలని తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వాన్ని రజక నాయకులు కోరారు. గురువారం రజక కార్యాలయంలో నేషనల్ దోబీ మహాసంఘ జాతీయ అధ్యక్షులు అన్నవరపు నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర నాయకులు బాదుగున్నల శ్రీను మాట్లాడుతూ హైదరాబాదులో 24/7 న్యూస్ టీవీలో చిట్టిబాబు మాట్లాడుతూ ఆఫ్టాల్ చాకలోడు చెబితే రామాయణంలో రాముడు సీతమ్మను నిప్పుల్లో దూకమన్నాడని రజకుల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీస్తూ అహంకారంగా మాట్లాడారని పేర్కొన్నారు. తెలుగు రెండు రాష్ట్రాలకు రజకులకు వెంటనే చిట్టిబాబు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రజకులను చాకలోడని పిలవకూడదని జీవో ఉన్నా కూడా తన అహంకారంతో మాట్లాడాని అన్నారు. రజక యువజన నాయకులు ముట్టుకూరి మణికంఠ, దమ్మాటి మల్లికార్జునరావు, శ్రీరాములు పాల్గొన్నారు.

ఆగిన పూడికతీత పనులు



శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురం ఎస్టీ కాలనీలో మురుగుకాల్వల్లోని మురుగునీరు పోకుండా కాల్వఅంతా పూడ్చివేశారు. దీంతో దోమల ప్రభావం ధాటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన ఫలితం లేదని వాపోతున్నారు. కాలనీలో ఐదు వీధులు ఉండగా ఒక వీధిలో మాత్రమే మురుగుకాల్వ ఏర్పాటు చేశారు.మిగిలిన నాలుగు వీధుల్లో మురుగుకాల్వ లేనందున కాలనీవాసులు ఆగచాట్లు పడుతున్నారు. కాలనీ నిర్మాణ పనులు పూర్తి అయి సంవత్సరాలు గడుస్తున్నా పాలకుల హామీలు మినహా చేసిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి మురుగుకాల్వ పూడికతీత పనులు చేయటంతో పాటు మిగిలిన వీధుల్లో కూడా మురుగుకాల్వలు ఏర్పాటు చేయాలని కాలనీ వాసీ పోట్లూరు మల్లిఖార్జునరావు తెలిపారు.

అనధికార విద్యుత్ వినియోగిస్తే కఠిన చర్యలు



అపరాధ రుసుం విధిస్తున్న విద్యుత్ ఉన్నతాధికారులు

చిలకలూరిపేట: అనధికార విద్యుత్ వినియోగానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని విద్యుత్ ఉన్నతాధికారులు హెచ్చరించారు. సీఆర్‌డీఏ సర్కిల్ విద్యుత్ ఎస్ఈ పి.సుబ్రమణ్యం, ఈఈ సీహెచ్ రమేష్, విజిలెన్స్ ఈఈ సీహెచ్ వెంకటేశ్వరరావుల ఆధ్వర్యంలో 36 బృందాలుగా ఏర్పడి గురువారం విద్యుత్ అధికారులు దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా అనధికారికంగా విద్యుత్ అధిక వినియోగం చేస్తున్న 87 సర్వీసులను గుర్తించి రూ. 3.84 లక్షలు అపరాధ రుసుం విధించారు. గృహ వినియోగం కింద విద్యుత్ కనెక్షన్ తీసుకొని వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తున్న నాలుగు సర్వీసులను గుర్తించి రూ. 70 వేలు, అనధికారికంగా విద్యుత్ వినియోగిస్తున్న ఐదు సర్వీసులకు రూ. 55 వేలు, కనెక్షన్ లేకుండా లైన్ల మీద వైరు వేసి విద్యుత్ వినియోగిస్తున్న ఒక సర్వీసుకు రూ. 5 వేలు అపరాధ రుసుం విధించారు. భవిష్యత్‌లోనూ విస్తృత స్థాయిలో దాడులు నిర్వహిస్తామని విద్యుత్ అధికారులు హెచ్చరించారు. విద్యుత్ డీఈఈలు ఆర్ అశోక్‌కుమార్, ఎ.గురునాధరావు, ఎస్ మల్లిఖార్జున ప్రసాద్, 11 మంది ఏఈఈలు పాల్గొన్నారు.

వర్సిటీ క్రికెట్ జట్టుకు తిరుమల విద్యార్థి



ప్రియతమ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణ

నరసరావుపేట రూరల్: జేఎన్‌టీయూకే యూనివర్సిటీ క్రికెట్ జట్టుకు తిరుమల ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి కె.ప్రియతమ్ ఎంపికై నట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైవీ నారాయణ గురువారం తెలిపారు. తమిళనాడులోని మద్రాసు యూనివర్సిటీలో ఈనెల 16 నుంచి 21వ తేదీ వరకు జరుగనున్న దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయ క్రికెట్ పోటీలలో ప్రియతమ్ జేఎన్‌టీయూకే జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. వర్సిటీ జట్టుకు ఎంపికైన ప్రియతమ్‌ను కళాశాల కార్యదర్శి రావెల సత్యనారాయణ, ప్రిన్సిపల్ వైవీ నారాయణ, వ్యాయామ అధ్యాపకుడు వి.హనుమంతు రావు, అధ్యాపకులు అభినందించారు.

చాణక్య విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని చాణక్య అకాడమీకి చెందిన స్కేటింగ్ ప్లేయర్స్ రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. తెలంగాణ హైదరాబాద్‌లో జరిగిన స్కేటింగ్ పోటీల్లో 14 మంది ప్లేయర్స్ పాల్గొనగా 12మంది మెడల్స్ సాధించారని అకాడమీ డైరెక్టర్ కంచర్ల నాగార్జున తెలిపారు. ఈ మేరకు విద్యార్థులకు, వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించి అభినందించారు.

నేడు కోదండరామాలయంలో ఉత్తర ద్వారదర్శనం



గణపవరం కోదండరామాలయం

నాదెండ్ల: గణపవరంలోని నూతన కోదండరామాలయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి వేడుకలు నిర్వహించనున్నట్లు పూజారి దర్శి అనిల్‌కుమార్ శర్మ చెప్పారు. తెల్లవారుజామున 4.30 గంటల నుంచి అలంకరణ, విశేష అర్చన, ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 10 గంటల నుంచి స్వామివారికి పురవీధుల్లో గ్రామోత్సవం జరగనుంది. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తున్నారు.

ధనుర్మాస ఉత్సవాలు

రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా స్వామి వారు గురువారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే శుక్రవారం ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని స్వామి వార్లను భక్తులు ఉత్తర ద్వారం దర్శనం చేసుకునేందుకు వైష్ణవ ఆలయాల్లో ఆయా దేవాలయ కమిటీ ఏర్పాట్లను పూర్తి చేసింది.

డాక్టర్ జాన్‌డేవిడ్ సేవలు విలువైనవి



జాన్ డేవిడ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న డాక్టర్ జెస్సీ ఎస్ బర్నబాస్

చిలకలూరిపేట: డాక్టర్ ఎస్ జాన్‌డేవిడ్ సేవలు ఎంతో విలువైనవని ఫార్ కార్నర్స్ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ జెస్సీ ఎస్ బర్నబాస్ తెలిపారు. ఏఎంజీ, ఫార్ కార్నర్స్ స్వచ్ఛంద సంస్థల వ్యవస్థాపకుడు జాన్‌డేవిడ్ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఏఎంజీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభలో బర్నబాస్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా సేవలు అందించిన మహోన్నత వ్యక్తి జాన్‌డేవిడ్ అని కొనియాడారు.

ఆయన స్థాపించిన సంస్థల్లో చదువుకున్న ఎంతో మంది పేద విద్యార్థులు నేడు ఉన్నత స్థానాల్లో ఉన్నారని పేర్కొన్నారు. చిలకలూరిపేట పట్టణానికి మంచినీటి చెరువు ఏర్పాటుకు నిధులు అందించి దాహార్తి తీర్చారని వెల్లడించారు. ఆయన చేసిన సేవలు భావితరాలు ఆదర్శంగా తీసుకొని సేవా కార్యక్రమాలకు కొంత సమయం వెచ్చించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంజీ బోర్డు సభ్యులు మోజేస్, ఎం జోసఫ్, పాస్టర్లు ప్రసన్న, కృపాదానం, దీపక్, అబ్రహం పాల్గొన్నారు.

రాష్ట్రంలో బలహీన వర్గాలకు రక్షణ కరువు



మాట్లాడుతున్న ఎం.ఎస్.ప్రసాద్

వినుకొండ(నూజెండ్ల): రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల వారికి రక్షణ కరువైందని, సామాన్యులకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే దాడులు చేయడం దుర్మార్గమైన చర్య అని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి ఎం.ఎస్. ప్రసాద్ అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఇటీవల పోలీసులు వేధింపులకు గురి చేసిన వంకుదావత్ దుర్గాప్రసాద్ నాయక్ కుటుంబసభ్యులు, గ్రామస్తులతో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల బొల్లాపల్లి మండలం వెంకటరెడ్డిపురం గ్రామానికి చెందిన వంకుదావత్ దుర్గాప్రసాద్ నాయక్ అనే యువకుడిని విచారణ పేరుతో పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి అతనిపై చేయి చేసుకోవడాన్ని తప్పుపట్టారు. బొల్లాపల్లి ఎస్ఐ అమాయకుల పట్ల ఇలా ప్రవర్తించడం సరికాదని, పోలీస్ వ్యవస్థ అంటేనే ప్రజలు భయపడే విధంగా ప్రవర్తించడం పద్ధతి కాదన్నారు. డిగ్రీ చదువుతున్న యువకుడని కూడా చూడకుండా అతని భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకోకుండా పోలీసులు ప్రవర్తించిన తీరు పలు విమర్శలు తావిస్తుందన్నారు. విద్యార్థిపై చేయి చేసుకున్న ఎస్ఐపై సమగ్ర విచారణ జరిపి బాధితుని కుటుంబానికి న్యాయం జరిగేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో న్యాయపోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో కుటుంబసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సాగర్ కాలువల సమస్యలు పరిష్కరిస్తాం

ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లు



మాట్లాడుతున్న చైర్మన్ కాంతారావు

నరసరావుపేట: నాగార్జునసాగర్ కుడికాలువకు అనుబంధంగా ఉన్న కాలువల్లో జంగిల్, పూడికతీత తొలగింపు, గట్ల పటిష్టత, లస్కర్ల సిబ్బంది కొరత సమస్యలను రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు, వైస్‌చైర్మన్ ఉప్పలపాటి చక్రపాణి పేర్కొన్నారు. గురువారం ఎన్ఎస్పీ కార్యాలయంలో ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ అధ్యక్షతన సాగర్ కుడికాలువ ప్రాజెక్ట్ కమిటీ పరిధి లోని డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డీసీ)ల అధ్యక్షుల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. దీనికి బాపట్ల, ప్రకాశం, పల్నాడు, గుంటూరు జిల్లాల పరిధిలో గల మొత్తం 48 మంది డీసీ ప్రెసిడెంట్స్, జలవనరుల శాఖ ఎగ్జిక్యూటివ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు హాజరయ్యారు. ఈసందర్భంగా డీసీలు తమ పరిధిలోని సమస్యలను ఎన్ఎస్పీ విభాగ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీ ప్రెసిడెంట్ గోగినేని కోటేశ్వరరావు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులతో ఎంఈవో, నాయకులు

చిలకలూరిపేట: విద్యార్థులు సబ్జెక్ట్ నిపుణులు రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈవో కె లక్ష్మి సూచించారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను పట్టణంలోని బీఆర్‌ఐజీ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు 160 మందికి గురువారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని సబ్జెక్టులకు సంబంధించి మెటీరియల్ తయారు చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థుల అభ్యున్నతి కోసం ఉపాధ్యాయ సంఘం ఇలాంటి కార్యక్రమం చేపట్టడం ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు, డైరీ కమిటీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు, నాయకులు వినుకొండ అక్కయ్య, మేకల కోటేశ్వరరావు, వడ్లాన జయప్రకాశ్, తన్నీరు అనురాధ, కోటా వేదమణి తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ సందేశాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్ఐ అశోక్

నరసరావుపేటటౌన్: సెల్‌ఫోన్‌లకు వచ్చే సందేశాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ కౌన్సిలర్ కొత్తపల్లి ప్రదీప్ అన్నారు. టూటౌన్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో గురువారం పీఎన్‌సీ అండ్ కేఆర్, ఎస్‌కేఆర్‌బీఆర్ కళాశాలల్లో సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అనధికార వెబ్‌సైట్లను వినియోగించక పోవటం మంచిదన్నారు. మొబైల్ యాప్ డౌన్ లోడ్ చేసే సమయంలో వచ్చే పరిమిషన్‌లు, మెసేజ్‌లు, ఓటీపీలతో జాగ్రత్తగా వ్యవహరించాలన్నా రు. అజ్ఞాత వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం ఇవ్వరాదన్నారు. ఏదైనా అనుమానాస్పద సందేశం వచ్చినప్పుడు సైబర్ క్రైం వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. ఎస్ఐ అశోక్ మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో నేరాల నియంత్రణలో భాగంగా ప్రతి కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

ప్రమోషన్ ఇవ్వాలంటూ ఫిర్యాదు

నాదెండ్ల: అంగన్‌వాడీ హెల్పర్‌గా పనిచేస్తున్న తనకు వర్కర్ పోస్టులో ప్రమోషన్ ఇవ్వాల్సి ఉన్నా అధికారులు నిబంధనలు ఉల్లంఘించి నోటిఫికేషన్ విడుదల చేశారంటూ గణపవరం గ్రామానికి చెందిన జొన్నలగడ్డ రాణి గురువారం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది.గణపవరం అంగన్‌వాడీ సెంటర్ 15లో హెల్పర్‌గా పనిచేస్తున్నానని, విద్యార్హత, అనుభవం ఉన్నందున తనకు నిబంధనల మేరకు 14వ అంగన్‌వాడీ సెంటర్‌లో ఖాళీగా ఉన్న వర్కర్ పోస్టు కేటాయించాల్సి ఉందన్నారు. ఈ మేరకు గతంలో తాను ఆశ్రయించగా, న్యాయస్థానం తనకు అనుకూలంగా ఆదేశాలు జారీ చేసిందన్నారు. అయితే నాదెండ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారులు తన వద్ద సర్టిఫికెట్లు తీసుకుని, అవకాశం ఇవ్వకుండా నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. నిబంధనల మేరకు తనకు ప్రమోషన్ ఇవ్వాలంటూ ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది.